క్లుప్తంగా

నిబంధనల మేరకే ఎరువుల విక్రయం



రైతులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ ఖాదర్‌బాషా

కారంచేడు: ఎరువుల దుకాణ యజమానులు, సొసైటీల సిబ్బంది ఎరువుల విక్రయాల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ షేక్ ఖాదర్‌బాషా స్పష్టం చేశారు. శనివారం స్వర్ణ గ్రామంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. అక్కడ ఎరువుల కోసం బారులు తీరి నిలబడిన రైతులతో మాట్లాడారు. ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలని, ఎక్కువ ధరలతో విక్రయిస్తే వారిపై శాఖాపరమైన చర్యలు కూడా ఉంటాయన్నారు. పోలీస్ సిబ్బంది, దుకాణ యజమానులు, రైతులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి వాటర్ కూలర్ వితరణ



కూలర్ ప్రారంభిస్తున్న తహసీల్దార్ నాగరాజు

కారంచేడు: తహసీల్దారు కార్యాలయ సిబ్బందితో పాటు, వివిధ సమస్యలపై కార్యాలయానికి వచ్చే ప్రజల కోసం గ్రామానికి చెందిన మువ్వల కాశీవిశ్వనాథం వాటర్ కూలర్‌ను శనివారం బహూకరించారు. దాతను తహసీల్దార్ జి. నాగరాజు అభినందించారు. డిప్యూటీ తహసీల్దారు అనిత, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్పెల్‌బీతో ఆత్మవిశ్వాసం



స్పెల్‌బీ విజేతలతో ఉపాధ్యాయులు

కొడవలివారిపాలెం (కారంచేడు): స్పెల్‌బీతో విద్యార్థులు ఆత్మ విశ్వాసం పెంపొందించుకోవచ్చని హైస్కూల్ హెచ్‌ఎం ఏ. ఉమామహేశ్వరరావు అన్నారు. శనివారం కొడవలివారిపాలెం ఉన్నత పాఠశాల ప్రాంగణంలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉన్న విద్యార్థులకు పోటీలు నిర్వహించామన్నారు. లెవల్-1లో చిరుమల యమునశ్రీ, లెవల్-2లో డీ షాలేమ్‌రాజు, లెవల్-3లో ఐ సుష్మ విజయం సాధించారని తెలిపారు. పోటీలకు న్యాయనిర్ణేతగా షేక్ రేష్మ వ్యవహించాగా ఉపాధ్యాయులు పర్యవేక్షించారన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వ్రతాలు



అనంత పద్మనాభ స్వామి వ్రతానికి ఏర్పాటు చేసిన కలశాలు

వేటపాలెం: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ప్రాంగణలో అనంత పద్మ నాభ స్వామి వ్రతాలు భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. 130 మంది మహిళలు సామూహిక సత్యనారాయణ వ్రతాల్లో పాల్గొన్నారు. అనంత పద్మనాభ స్వామి వ్రతం ఆచరించిన వారి కుటుంబాలు సుఖసంతోషాలు వెల్లివిస్తాయని నమ్మకం. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ గావించారు.



వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

రైతులను ఆదుకోవడంలో కూటమి విఫలం

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, పర్చూరు నియోజక వర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి
- యూరియాను దారి మళ్లించిన టీడీపీ నేతలపై చర్యలు తీసుకోవాలి

పర్చూరు (చినగంజాం): రాష్ట్రంలో రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, పర్చూరు నియోజక వర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామంటూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోక పోగా వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. యూరియాను దారి మళ్లించిన టీడీపీ నేతలపై సత్వరం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో పొగాకు రైతులు తాము పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించేలా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు తీసుకున్నారని.. రైతులు ఎంతో ఉత్సాహంగా ఈ ఏడాది కూడా కూటమి ప్రభుత్వ హామీలు నమ్మి పొగాకు సాగును చేపడితే వాళ్ళ ఆశలను వమ్ము చేశారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ రైతుల పక్షాన నిలిచి పొగాకు రైతుకు న్యాయం చేయాలని పోరాటాలు చేపట్టిన ఫలితం పొగాకును చివరి ఆకువరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తామని ముందుకు వచ్చారని పేర్కొన్నారు. ప్రస్తుతం బర్లీ పొగాకును పూర్తి స్థాయిలో కొనుగోలు చేయక పోగా వారిని పూర్తి ఇబ్బందులకు గురి చేస్తున్నారని, కేవలం 20 శాతం మాత్రమే పొగాకును కొనుగోలు చేస్తూ.. ఆంక్షలు విధిస్తూ పొగాకు కొనుగోలు కేంద్రానికి వచ్చిన రైతులను తిప్పిపంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



గాదె మధుసూదనరెడ్డి

ఇదేనా కూటమి ప్రభుత్వ రైతులను ఆదుకోవడం అంటే అని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుతం రైతులకు పంట సీజన్ వచ్చి సాగుకు సిద్ధం అవుతున్న సమయంలో పంటకు కావాల్సిన యూరియాను రైతులకు అందుబాటులో ఉంచక పోగా కృత్రిమ కొరత సృష్టిస్తూ రైతులను నానారకాలైన అవస్థలు పెడుతున్నారని ఆరోపించారు. యూరియాను ముందుగానే కూటమి ప్రభుత్వంలోని నాయకులు దొడ్డిదారిన తమ సొంత గోడౌన్‌లలో నిల్వలు ఉంచుకొని రైతులకు దక్కనీయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. అంతే గాకుండా యూరియాను దారి మళ్ళించినట్లు విజిలెన్స్ దాడుల్లో తేటతెల్లమయిందని, యూరియాను వ్యవసాయేతర పనులకు వినియోగిస్తున్నా పట్టించుకోని కూటమి ప్రభుత్వం చర్యలను చూస్తూ ఊరుకోలేమని ఆయన మండి పడ్డారు. యూరియాను దారి మళ్ళిస్తున్న సత్వరం అదుపులోనికి తీసుకొని వారి వద్ద ఉన్న నిల్వలను గుర్తించి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని, అటువంటి చర్యలకు పాల్పడిన టీడీపీ నేతలపై సత్వరం చర్యలు తీసుకోవాలన్నారు.

మన మిత్ర యాప్ సద్వినియోగం చేసుకోండి

పర్చూరు(చినగంజాం): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మన మిత్ర యాప్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటస్వామి తెలిపారు. శనివారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కొల్లావారిపాలెంలోని సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయంలోని రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ప్రభుత్వ సర్వేలన్నింటినీ పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న 709 రకాల సేవలను మన మిత్ర వాట్సప్ 9552300009 నంబర్ ద్వారా వివిధ శాఖలకు సంబంధించిన సేవలను పొందవచ్చని తెలిపారు. సచివాలయ సిబ్బంది గ్రామాల్లోని ప్రజలకు మనమిత్ర యాప్ ద్వారా సేవలను పొందే విధానాన్ని వివరించాలన్నారు. మండలంలోని సచివాలయాల సిబ్బంది యాప్ ఎలా వినియోగించాలో ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయాలన్నారు. ప్రజలువారికి కావాల్సిన సేవలను కార్యాలయం చుట్టూ తిరగకుండా యాప్ పొందవచ్చన్నారు. కార్యక్రమం ప్రతి శుక్రవారం నిర్వహించాలన్నారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది

అదనపు బాధ్యతలు అప్పగించడం తగదు



నిరసన వ్యక్తం చేస్తున్న వార్డు సచివాలయ ఉద్యోగులు

చీరాల రూరల్: మున్సిపల్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న వార్డు సచివాలయ ఉద్యోగులకు సర్వేలు ఇతర అదనపు బాధ్యతలు అప్పగించామని ఏపీ ఎన్‌జీఓ తాలూకా అధ్యక్షుడు చింతా శేషుబాబు పేర్కొన్నారు. వార్డు సచివాలయ ఉద్యోగులకు అదనపు బాధ్యతలను నిరసిస్తూ శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ జేఏసీ ఆధ్వర్యంలో లంచ్ అవర్‌లో ప్లకార్డులు చేతపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. శేషుబాబుతో పాటు అసోసియేట్ ప్రెసిడెంట్ అనిల్‌కుమార్ మాట్లాడారు. మున్సిపల్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న వార్డు సచివాలయ ఉద్యోగులకు సంబధం లేని ఇంటింటి సర్వేలు చేయమనడం, శానిటేషన్ సెక్రటరీలకు బీఎల్‌ఓ విధులు అప్పగించడం, కౌసలం సర్వే, ఆధార్ సెండింగ్, వాహనమిత్ర డేటా, వితౌట్ ఆధార్, చిల్డ్రన్స్ డేటా సర్వేలు చేయించడం వంటి పనులు అప్పగించడం తగదన్నారు. ఇటువంటి పనులన్నీ గత ప్రభుత్వంలో వలంటీర్లు చేసేవారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సచివాలయ ఉద్యోగులు చేయాల్సిన విధులను మాత్రమే అప్పగించాలని వారు డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు శ్రీనివాసరెడ్డి, శ్రీనునాయక్, సతీష్, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో ఔషధ మొక్కలు పెంచుకోవాలి

వేటపాలెం: ప్రతి ఇంట్లో ఔషధ మొక్కల పెంచుకోవాలని రాష్ట్ర ఔషధ, సుగంధ మొక్కల బోర్డు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ అధికారి కె. ప్రదీప్‌కుమార్ సూచించారు. అక్కాయిపాలెం పంచాయతీ లక్ష్మీపురంలో ప్రొటెక్ట్ సంస్థ నిర్వహిస్తున్న ఔషధ మొక్కల నర్సరీని శనివారం సందర్శించారు. ఆస కలిగిన రైతులకు తిప్పతీగ, తులసి, నిమ్మగడ్డి, కలబంద తదితర ఔషధ మొక్కలను పంపిణీ చేయడానికి బోర్డు నుంచి ప్రణాళిక తయారు చేసి త్వరలో రైతులకు అందిస్తామన్నారు. అలాగే ఆసక్తి కలిగిన రైతులు వారి పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు. భవిష్యతుల్లో తిప్పతీగ మొక్క ఆవశ్యకతను ఉపయోగాలను వర్క్ షాప్ ద్వారా రైతులకు తెలియచే స్తామన్నారు. ప్రతి ఔషధ మొక్క ఉపయోగాలు సమాజంలో తెలిసేలా చేసి వారి ఆరోగ్య స్థితిగతులను ఔషధ మొక్కల ద్వారా పెంపొందించు కోవాలన్నారు. ప్రొటెక్ట సంస్థ కార్యదర్శి శవనం చంద్రారెడ్డి పాల్గొన్నారు.



నర్సరీని సందర్శిస్తున్న ఏడీ ప్రదీప్ కుమార్

నాణ్యమైన వైద్య సేవలు అందించండి

అద్దంకి: పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని డీసీహెచ్‌ఎస్ పద్మావతి శనివారం సందర్శించారు. ఐపీ, ఓపీ, తదితర విభాగాలను పరిశీలించారు. వైద్యశాలకు వచ్చిన రోగులకు సత్వర వైద్యం అందించాల్సిన బాధ్యత వైద్యులపై ఉంటుందని చెప్పారు. రికార్డులు, వైద్యశాల ఓపీ బాగుందన్నారు. డాక్టర్ వాహిలా చౌదరి, వైద్యాశాలలోని వైద్యులు, వివిధ విభాగాలకు చెందిన వారున్నారు.



పద్మావతిని సన్మానిస్తున్న వైద్యాధికారి

నేడు అద్దంకిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

అద్దంకి రూరల్: విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా ఆదివారం అద్దంకి పట్టణంలోని రామ్ నగర్ పరిధిలోని రామ్‌నగర్ సెంటర్, ఒంగోలు రోడ్డు, రాజీవ్ కాలనీ, జగనన్న కాలనీ, గ్యాస్‌గోడౌన్, నర్రావారి పాలెం, బలిజపాలెం, శ్రీనగర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనుక ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు డీఈఈ ఎం. దామోదం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గుండెపోటుతో వైదన సర్పంచ్ మృతి

బల్లికురవ: గుండెపోటు సంభవించగా వైద్యానికి తరలించే క్రమంలో మార్గ మధ్యంలోనే వైదన గ్రామ పంచాయతీ సర్పంచ్ మేడా జయలక్ష్మి(67) శుక్రవారం అర్ధ రాత్రి మృతి చెందారు. 2021లో నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ సానభూతిపరురాలిగా ఎన్నికయ్యారు. బాధ్యలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు గ్రామాభివృద్ధికి పాటుపడ్డారు. మృతురాలి పెద అంజయ్య ఆరు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. ఈమెకు ఇరువురు కుమారులు, ఇరువురు కుమార్తెలున్నారు. వైదనతోపాటు ఆ పంచాయతీలోని చవిటి మాదిగపల్లిలో విషాదఛాయలు అలముకున్నాయి. సర్పంచ్ జయలక్ష్మి భౌతిక కాయానికి మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దేవినేని కృష్ణబాబు, అద్దంకి నాయకుడు పానెం నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి, స్థానిక నేతలు ఏ. సతీష్, ఎం. రవిబాబు, సి. వెంకట్రామిరెడ్డి, ప్రత్తిపాటి అక్కులు, మూడావత్ హరికృష్ణనాయక్, గాలం ప్రభాకర్ తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించారు.



వైదన సర్పంచ్ ఫైల్ (ఫైల్)



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాయకులు

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సత్కారం

కారంచేడు: బాపట్ల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డును స్వీకరించిన ఉపాధ్యాయురాలిని సత్కరించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సెప్టెంబర్ 5వ తేదీన బాపట్ల కలెక్టర్ వెంకటమురళి, డీఈఓ పురుషోత్తంల చేతుల మీదగా ఉత్తమ అవార్డును తీసుకున్నారు. మండల కేంద్రమైన కారంచేడు ఎన్‌టీఆర్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విదులు నిర్వహిస్తున్న కె. విజయచంద్రను శనివారం పాఠశాలలో ఘనంగా సత్కరించారు.



ఉత్తమ ఉపాధ్యాయురాలు విజయచంద్రను సత్కరిస్తున్న కాలనీవాసులు

వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యం

ఉప్పుటూరు(చినగంజాం): ప్రతి ఒక్కరికి ముఖ్యంగా మహిళలకు వ్యక్తిగత పరిశుభ్రత అనేది అత్యంత ముఖ్యమైన ప్రక్రియగా గుర్తించాలని ఉప్పుటూరు ప్రభుత్వహోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్ర శేఖర్ అన్నారు. మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా శనివారం ఉప్పుటూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నెలసరి పరిశుభ్రత, బాల్యవివాహాలపై విద్యార్థినులకు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునంద అధ్యక్షతన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్ర శేఖర్ మాట్లాడుతూ స్త్రీలకు 18 సంవత్సరాలు.. పురుషునికి 21 సంవత్సరాలు దాటాక వివాహం చేయాలన్నారు. రుతుస్రావ సమయంలో శానిటరీ పాడ్స్‌ను ప్రతి 3 గంటలకు తప్పక మార్చుకోవాలని, నీటిని ఎక్కువగా తాగాలని, స్త్రీలలో మూత్ర నాళం పొడవు తక్కువగా ఉండటం వలన సులంభంగా మూత్రంలో ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అందుకే మూత్ర విసర్జన అనంతరం పరిశుభ్రతలను పాటించాలన్నారు. జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంతో పాటు మహిళా పోలీస్ పద్మావతి, పంచాయతీ కార్యదరిశ నీలం వెంకటరామకృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్



అద్దంకి: అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు

అద్దంకి: పిల్లలకు తల్లిదండ్రి తరువాత గురువే ప్రధానమని రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు బాచిన శివధర పూర్ణచంద్రరావు అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాని పురస్కరించుకుని శనివారం చిన్ని శాంతయ్య పిచ్చమ్మ గార్లసేవాసదన్‌లో ఉపాధ్యాయులకు పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణ మాజీ సర్పంచ్ చెన్నుపల్లి వెంకటేశ్వర్లు సౌజన్యంతో ఉపాధ్యాయులకు రోటరీ బిల్డర్స్ అవార్డులు ప్రదానం చేశారు. అవార్డులను నరిసెట్టి రాధాకృష్ణమూర్తి, వజ్జా ప్రసాదరావు, పెద్దినేని సరేంద్ర బాబు మద్దిపాటి శ్రీనివాసరావు, జంధ్రాజుపల్లి నాగేశ్వరరావు, ఈదుమూడి ఆంజనేయులు, వెల్లంపల్లి మల్లిఖార్జునరావు, గాలింకి ఆనంద్‌బాబు, మోడి విజయశ్రీ, ఈమని రజితలకు అందజేశారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

చినగంజాం: మండలంలోని మూడు రేవు ప్రాంతాలు మోటుపల్లి, పల్లెపాలెం బాపయ్య నగర్, పెదగంజాం పల్లెపాలెంలో మొత్తం 14 వినాయక విగ్రహాలను శనివారం నిమజ్జనం చేశారు. నిమజ్జనోత్సవం చివరి రోజు కావడంతో మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు.

బల్లికురవ: ఎంతో చరిత్ర కలిగిన బ్రహ్మకుండం వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడు పదిరోజుల పాటు నిత్య పూజలందుకున్నాడు. శనివారం మేళతాళాలు, డప్పువాయిద్యాలతో కొణిదెన, గంగపాలెం గ్రామోత్సవం చేపట్టారు.

సంతమాగులూరు (అద్దంకి రూరల్): వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు గ్రామంలోని పాటిమీద ఏర్పాటు చేసిన శివలింగం ఆకారంలో ఏర్పాటు చేసిన లడ్డూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్రామానికి చెందిన దక్కా హనుమంతరావు 17 కేజీలతో ప్రత్యేకంగా తయారు చేయించారు. భక్తులకు ప్రసాదంగా అందజేయనున్నట్లు హనుమంతరావు కుమారులు దక్కా కిషోర్, ప్రసాద్‌లు తెలిపారు.



చినగంజాం: సముద్రంలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు

కన్వీనర్ బృందం పరామర్శ

బల్లికురవ: అనారోగ్యంతో బాధపడుతూ అద్దంకిలో చికిత్స పొందుతున్న కొమ్మినేనివారిపాలెం గ్రామ పార్టీ అధ్యక్షుడు గోగినేని వెంకట రామాంజనేయులును శనివారం వైద్యశాలకు వెళ్లి పరామర్శించారు. మండల పార్టీ కన్వీనర్ దేవినేని కృష్ణబాబు, అద్దంకి నాయకుడు పానెం నరసింహారెడ్డి, రామాంజనేయులు అనారోగ్య పరిస్థితిని తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



గోగినేనిని పరామర్శిస్తున్న మండల కన్వీనర్, నరసింహారెడ్డి

వైభవంగా సుదర్శన హోమం



సుదర్శన హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

చినగంజాం: స్థానిక పురాతన సీతారామాలయం ప్రాంగణంలో ఆలయ పునర్నిర్మాణం పురస్కరించుకొని శనివారం సుదర్శన హోమాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా హోమం నిర్వహించారు. ఆలయ ట్రస్టీ మోటుమర్రి రామసుబ్బారావు దంపతులు, వలివేటి వెంకట రామానుజం దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.